పాలవర్తి వేణుగోపాల్

**పల్లెలో** పొద్దు పొడిచింది.

ఆ ఊరి పూర్తి పేరేమిటో కానీ, అందరూ దాన్ని పల్లె అనే అంటారు. ఏభై గడప దాటీ దాటకుండా ఉన్నట్లున్న ఆ పల్లెకు నెలవంక వాగు తల్లిలాంటిది. తల్లి పిల్లను పొదివి పడుకున్నట్లు పల్లెకు మూడువైపుల చుట్టుకుని వంకర తిరిగి ప్రవహిస్తుంది నెలవంక. ఎప్పుడూ పారే ఆ వాగు ఎత్తుమీద నుంచి చూస్తే భూమి మీది నెలవంకలానే ఉంటుంది. ప్రత్యేకించి వెన్నెల రాత్రుల్లో మరీను.

పల్లె పల్లే దానిని తల్లి వాగనే పిలుస్తుంది. నిజానికి అలా పిలవటంలో అనౌచిత్యం లేదు. పల్లె మొత్తానికి నీరు నెలవంక నుంచి కావిళ్ళలో పోవలసిందే. ఆ నీళ్ళే పొలాల దాహం తీర్చి పల్లెను ఆకలినుంచి ఆదుకోవాలి. పల్లెలో కొత్త కుటుంబం ఏర్పడితే ఆ నీటిలో మెరిసి నింగి వైపు చూపు సారించిన జమ్మి నీడ కల్పించాలి. మొత్తంమీద తాను నిలకడ లేకుండా పారుతూ పల్లె ప్రాణం నిలుపుతున్నది నెలవంక.

ఆ పల్లెలో పొద్దు పొడిచింది.

వసారాలో కట్టేసిన పెయ్య దూడ ఒళ్ళు నిమురుతూ, పండుంపుల్ల నములుతున్న వెంకటేశు లచ్చుమయ్య పిలుపు విని బయటికి వచ్చి చూసే వేళకు—ఆ పల్లెలో పొద్దు పొడిచింది. నెలవంక నీళ్ళలో కాషాయ వస్త్రాలు పరిచి పల్లెలో పొద్దు పొడిచింది.

"ఏంది, పెద్దయ్యా, పొద్దున్నే ఇట్టా వచ్చావు?" అంటున్న వెంకటేశు మాట పూర్తి కాకుండానే, దాన్ని పట్టించుకోకుండా లచ్చుమయ్య అన్నాడు:

"పల్లెలో బడి పెట్టాలిరా."

అది లచ్చుమయ్య గొంతులో అప్పుడు పుట్టిన మాటలా లేదు. ఎప్పుడో పుట్టిన తల్లి వాగు అలల ఎంతోకాలంగా మననం చేసుకుంటూ వస్తున్న గలగల అప్పుడు తన చెవికి సోకినట్లు ఉంది.

వెంకటేశు ఆశ్చర్యపోలేదు. ఆనందించాడు. "బాగుంది, పెద్దయ్యా" అన్నాడు.

"బాగుందంటే చాలదు. ఈవేళనుంచే మొదలు పెట్టాలి. రెండు రోజుల్లో వేరే పాక వేయిద్దాం. ప్రస్తుతానికి మనింట్లోనే మొదలుపెట్టు."

ఈసారి వెంకటేశు ఆనందించలేదు. ఆశ్చర్యపోయాడు. "నేనా? నాకేం చేతవుతుంది, పెద్దయ్యా! అక్షరం ముక్కొచ్చిన ప్రతివాడూ చదువు చెప్పలేడు...నాగేశంగారని మా మేష్టారొకాయన ఖాళీ లేక ఉద్యోగం పోతే ఊరికే ఉన్నారు. ఈమాటు పేట వెళ్ళినప్పుడు అడిగొస్తాలే" అన్నాడు.

వెంకటేశును అప్పటికప్పుడు ప్రయాణం చేయించేదాకా మనసు కుదుటపడలేదు లచ్చుమయ్యకు.

క్రితంరోజు జరిగిన విషయాలే లచ్చుమయ్య కళ్ళముందు కదులుతున్నాయి. మెదడులో మెదులుతున్నాయి.

చుట్ట చుట్టుకోవటంకోసం పొగాక్కాడ ఈనెలు తీస్తూ తన ఇంటి అరుగుమీద కూర్చున్న తను—"మాదు, పెద్దయ్యా" అనే పలకరింపుకి తల ఎత్తాడు. ఎదుట సీతాలు, రత్తయ్య నిలుచున్నారు. సీతాలు ఆపకుండా చెప్పుకుపోతున్నది: "మా ఇంట్లకేమో పిల్లల్లేరుగదా? మాకు అయిదుకురాయిరి! రెండోవాణ్ణో, మూడోవాణ్ణో తమకు పెంపకానికి ఇచ్చెయ్యమంటారు మా యప్పా, బావా. వీడేమో ససేమిరా అంటాడు. మధ్యన నలగలేక నేను చచ్చిపోతున్నాను."

సీతాలును చూశాడు తను. నోటిమాటకన్నా జోరుగా వస్తున్న కంటినీటిని చూశాడు.

"అది కాదు, పెద్దయ్యా" అంటూ మొదలు పెట్టాడు రత్తయ్య.

తను ఊళ్ళో అందరికీ పెద్దయ్యే. చిన్నా పెద్దా, మగా ఆడా అందరూ తనను అలానే పిలుస్తారు.

తను రత్తయ్య వైపు తిరిగాడు.

"నా పిల్లల్లో ఒకడు ఇంకొకళ్ళింటికి వెళ్ళిపోయి ఇంక నాకు కొడుకు కాడనుకుంటే నాకు బాధగా ఉంటుంది. వాళ్ళందరూ నా పిల్లలే. నాతోబాటే కలో గంజో తాగుతూ బతుకుతారు. నేనే పిల్లాణ్ణి వదిలి పెట్టలేను."

రత్తయ్య ముఖంలో కొట్టవచ్చినట్లు కనిపించిన పట్టుదలను చూశాడు తను. "అదేం మాట, రత్తయ్యా! నీ ఇంట్లో కాకపోయినా నీ అన్న ఇంట్లోనేగా పిల్లాడుండేది! ఎక్కడున్నా అందరూ ఇద్దరికీ పిల్లల్లాగా ఉండాలి. ఆ మాటకొస్తే వాడు నీకన్నా పెద్దవాడు. వెంటనే ఆదుకునేవాడు వాళ్ళకే ఎక్కువ అవసరం. కాబట్టి రెండోవాణ్ణో, మూడోవాణ్ణో కాదు, పెద్దవాణ్ణే వాళ్ళ కివ్వాలి." తన మాట మందలింపుగా మొదలై ఆజ్ఞగా మారింది.

ఆ మాట వింటూనే రత్తయ్య చూపులో ఒక పిచ్చి వాలకం పడింది. రెప్పవాలని కళ్ళు సూటిగా చూసిన ఆ చూపు తన కళ్ళలోనుంచి దూసుకుపోయి మెదడును తాకినట్లయింది.

ఒక్క నిమిషం అట్లానే చూసి కళ్ళు దించుకున్నాడు రత్తయ్య. వాలుతున్న ఆ రెప్పలకింద పరుచుకుంటున్న నీటి పొరను గమనించాడు తను. రత్తయ్య మూగగా వెనుదిరిగాడు. సీతాలు అతణ్ణి అనుసరించింది.

తనేమీ పల్లెకు రాజు కాదు. న్యాయాధికారి కాదు. తనంటే పల్లెలో ఎవరికీ భయం లేదు. గౌరవం మాత్రం అందరికీ ఉంది. పల్లెలో తన మాట జరగవలసిందేనన్న కట్టుబడి ఏమీ లేదు. కానీ, జరిగి తీరుతుంది. తనంటే వాళ్ళ కున్న నమ్మకం అట్లాంటిది. తను చెప్పింది తప్పని సరిగా న్యాయమే అయ్యుంటుందని వాళ్ళ ఉద్దేశం. ఒక్కొక్కళ్ళకు బాధ కలిగినా, ఆ మాటను పాటించటంలో మాత్రం అనుమానం లేదు.

తన మాట విన్న రత్తయ్య కళ్ళలో జీవం చచ్చి నీరు పుట్టటం తన గుండెను పిండేసింది. మనసంతా ఏదో దిగులుగా, గుబులుగా ఉండగా చుట్ట చుట్టుకుంటూ తల్లివాగు దోవ పట్టాడు. వెనుదిరిగి పోతున్న రత్తయ్య ముఖం పదే పదే గుర్తు వస్తున్నది. అనురాగంనుంచి అచేతనత్వానికి, ఆవేశసత్వం నుంచి అసహాయతకు క్షణాలమీద మారిన రత్తయ్య చూపును తను మరిచిపోలేక పోతున్నాడు.

తగువు క్షణంలో తీర్చేశాడు. కానీ, తనిచ్చిన తీర్పు సరి అయినదేనా అని అనుమానం కలిగింది. తను అంతగా ఆవేశపడి ఉండకూడదేమో అనిపించింది. ఆలోచించగా, ఆలోచించగా తన తీర్పు తనకే నచ్చలేదు. సీతాలు మాటలు విన్న మీదట తన మనసు దెబ్బ తింది. ఒక్క కుటుంబంగా బతుకుతున్న తమ పల్లెలో సహాయంకోసం ఒకరు ఇంకొకళ్ళను అంతగా దేవుళ్ళాడవలసిందేనా అనిపించింది. రత్తయ్య మాటల్లోని పట్టుదలలో తను అతని స్వార్థాన్నే చూడగలిగాడు గానీ, అభిమానాన్ని గమనించలేకపోయాడు. అది తన లోపమేనేమో? తన తీర్పులో తను సీతాలును కూడా కలవరపెట్టలేదుగదా? చుట్ట వెలిగించి ఆలోచనలో పడ్డాడు. పెద్ద ఊళ్ళలో కోర్టులుంటాయట. చదువుకున్న వాళ్ళు ఆలోచించి తీర్పులు చెబుతారట — అనుకుంటూ ఇసకలో చూపుడు వేలితో ఏవేవో గీతలు గీస్తూ కూర్చున్నాడు. అట్లా చేస్తున్న తనకు ఒక్కసారి ఆశ్చర్యం కలిగింది. తను గీస్తున్న కొన్ని గీతల్లో పెద్ద ఊళ్ళలో కొట్లమీద ఉండే అక్షరాల పోలికలు కనిపించాయి. ఏమన్నా ఒక్క అక్షరమన్నా సరిగ్గా వ్రాద్దామని ప్రయత్నించాడు. గీశాడు. చెరిపాడు. ఏవేవో వంకర్లు దిద్దాడు. ఆ అక్షరాల రూపాన్ని గుర్తు తెచ్చుకోవటానికి వ్యర్థ ప్రయత్నం చేశాడు. "ఏంది, పెద్దయ్యా, ఇసకలో ముగ్గు లేస్తున్నావు?" అన్న మాటకు తల ఎత్తి చూశాడు. చుట్టూ చేరి తనను వింతగా చూస్తున్న పది, పన్నెండు మంది పిల్లలను అంతదాకా గమనించలేదు.

"ఏమర్రా? చదువుకుంటారా?" తను అడిగాడు. మబ్బు లేని చినుకులాగా మీద పడ్డ ఆ ప్రశ్న వాళ్ళ కెవరికీ అర్థం కాలేదు.

"అదేంటి?" పదేళ్ళవాడి ప్రశ్న అది.

"అచ్చరాలురా." తనకు తెలిసినంతవరకు వివరించాడు ఇంకొకడు.

"అయెందుకు?" ఆశ్చర్యంగా చూశాడు మరొకడు. తమ విషయం కానట్లు మరుక్షణం గొడ్ల ధ్యాసలో పడిపోయారు అందరూ.

పల్లెలో వాళ్ళంతా రెండే రెండు రకాలు. పొలం కలవాళ్ళు, పొలం పనులు కలవాళ్ళు. పన్నెండు, పదమూడేళ్ళు దాటిన ప్రతివాడూ పొలం పనులకు వెళతాడు. ఆ లోపు వయసువాళ్ళు కామందుల పిల్లలైతే కాలవ ఈతలకూ, కూలీల పిల్లలైతే గొడ్ల మేతలకూ వెళతారు. పల్లె మొత్తంమీద ముగ్గురు, నలుగురు పిల్లలు మాత్రం ఆరు మైళ్ళ దూరాన ఉన్న పేటకు రోజూ వెళ్ళి వస్తూ పెద్ద బళ్ళో చదువుతున్నారు. వాళ్ళయినా అయిదవ

తరగతి దాకా ఏ చుట్టాల ఇళ్ళల్లోనో ఉండి చదువుకునేవాళ్ళే. ఆ చదువులైనా పొలం పనులకు మరో చెయ్యి అవసరమయ్యేదాకానే సాగుతాయి. ఈ గండాలన్నీ గడిచి హైస్కూలు చదువు పూర్తిచేసినవాడు పల్లెలో వెంకటేశు ఒక్కడే.

— పల్లె పోగొట్టుకున్న దేమిటో తనకు అర్థమైంది. కొడిగట్టిన చుట్టపీక దూరంగా విసిరేసి వెంకటేశుకోసం బయలుదేరాడు. అతడు ఊళ్ళో లేడనీ, రాత్రికి తిరిగి వస్తాడనీ ఎవరో చెప్పగా పొద్దుటే వాళ్ళింటికి వెళ్ళాడు.

వెంకటేశును పేటకు బయలుదేరదీసి అచ్చుమయ్య తృప్తిగా గాలి పీల్చుకున్నాడు. కనుచూపు మేర పరుచుకున్న పచ్చని చేల మధ్య నిల్చున్నట్లు హాయిగా ఉంది అచ్చుమయ్యకు.

బక్కపలచగా, పొడుగ్గా ఉన్న ఆ వ్యక్తి వెంకటేశుతో కలిసి వచ్చేసరికి ఆయ నెవరో తెలిసిపోయింది అచ్చుమయ్యకు. కాలుస్తున్న చుట్ట కాలవలోకి గిరాటేసి పడక్కుర్చీలోనుంచి ఒక్క ఉదుటున లేచి నిల్చున్నాడు. నమస్కారం చేసి, "నన్ను అచ్చుమయ్య అంటారు" అని తనను తాను పరిచయం చేసుకుంటూ, పై పంచెతో కుర్చీ దులిపి కూర్చోమన్నట్లు చూపించాడు.


"నమస్కారం, లక్ష్మయ్యగారూ!" అని ఆయన అంటుంటే అచ్చుమయ్య కెందుకో సిగ్గువేసింది. "చదువుకున్నోరు! నన్నట్లా పిలవద్దు, పంతులుగారూ!" అంటూ నమ్రతగా చెప్పాడు. "మా వెంకటేశు చెప్తుంటాడు. తమరు వీలైనంత తొందరగా మా పల్లెలో కాపరం పెట్టేసెయ్యొచ్చు. తమ రిక్కడ హాయిగా ఉండటానికన్ని ఏర్పాట్లూ పల్లె చేస్తుంది. ఇది ఉద్యోగం కాదు. తమరూ మాలో ఒకరై పల్లెలో పిల్లలకు చదువు చెప్పాలి. వీళ్ళు పెరిగి పెద్దయిన తరవాత మన పల్లెలో పుట్టినందుకు విచారపడకుండా ఉండేటట్లు చెయ్యాలి. తమకు జీవితం గడుస్తుంది కాబట్టి, ఇది ఉద్యోగమేనని తమ రనుకున్నా, ఉద్యోగ మిచ్చింది నేను కాదు. పల్లెలో ప్రతిఒకరు ఆ పని చేసినట్లే" అన్నాడు. ఆ మాటల్లో గుబాళించిన సంస్కారం నాగేశాన్ని ముగ్ధుణ్ణి చేసింది.

రెండు రోజుల్లో మూడు గదుల కుటీరం కట్టుబడి పూర్తికావటమేమిటి, సంసారంతో నాగేశం అందులో కాలు పెట్టడ మేమిటి — ఒకే సారి జరిగిపోయింది. మొదటి నుంచీ ఉన్న ఒక వేప చెట్టును ప్రహరీ లోపలికి చేర్చి కట్టారు.

పదిమంది పిల్లల్ని పోగేసుకుని అ, ఆ లు దిద్దించటం మొదలుపెట్టాడుగానీ, నాగేశానికి మరీ కాళ్ళు విరగ్గొట్టేసి నట్లున్నది. అక్కడక్కడా విసిరేసి నట్లున్న ఇళ్ళన్నీ కలిపినా ఒక ఫర్లాంగు చదరం మించదు పల్లె. నెలవంక నీళ్ళు అందే మూడు వైపులా వరిచేలూ, అరటి తోటలూ, కూరగాయల మడులూ ఉన్నాయి. నాలుగవ వైపు మెట్ట పంటలున్నాయి. వాటి మధ్య బిక్కుబిక్కుమంటూ ఉంది పల్లె. అక్కడ ఎవరిని కదిపినా పొలాలూ, పశువులూ తప్ప మరో మాట రాదు; మరో ధ్యాస లేదు. తాము పండించుకోవటం, తాము తినటం, మిగులుధాన్యమూ, కూరగాయలూ పేటలో అంగళ్ళకు వేసి పల్లెలో పండని వస్తువులు కొనుక్కోవటం. అంతకు మించి ఎదుగూ బొదుగూ లేని జీవితాలు. ఒక వేడుక, వినోదం లేదు; ఒకసంకడి, సంబరంలేదు. చుట్టూ ప్రపంచంతో సంబంధం లేకుండా ఏ ఆశలూ, ఆశయాలూ లేకుండా వీళ్ళు ఎందుకు బ్రతుకుతున్నట్లు? ఏ పరమార్థం ఆశించి జీవిస్తున్నట్లు? నాగేశాని కంతా అయోమయంగా ఉంది. తన ఇంటికి గానీ, బడికిగానీ ఏమన్నా కావాలంటే మాత్రం క్షణాల మీద అమరుతుండేవి. ఆ ఏర్పాట్లు ఎవరు చేస్తున్నారో, ఎట్లా జరుగుతున్నాయో అతనికి అర్థమయ్యేది కాదు. పలకల మీద అక్షరాలు దిద్దబెడుతూ, నల్లబల్ల ఉంటే బాగుంటుందని తను అన్నాడో లేదో ఆ సాయంత్రానికి పెద్ద నాపరాయి తన ఇంటికి చేరింది.

అచ్చుమయ్యతో, వెంకటేశుతో అప్పుడప్పుడొకళ్ళు, అప్పుడొకళ్ళు పెద్దవాళ్ళు వచ్చి నాగేశం మాటలు ఆసక్తిగా వింటుండేవారు. రోజు గడవగా, గడవగా పల్లె గురించి ఎన్నెన్నో విషయాలు తెలియసాగాయి నాగేశానికి.

పల్లె నెలవంక కటువైపున్న మునగపాడు గ్రామానికి శివారు. అది కూడా చిన్న పల్లెటూరే కావటంతో వాగు దాటే అవసరం వీళ్ళకూ, వాళ్ళకూ లేదు. మూడు కోసులు దిగువ సన్న లాకుల మీదుగా నడిచివెళ్ళే వీలుంది. బండి నడిచే దోవ ఇంకా చాలా చుట్టు. ఒకప్పుడు ఆ రెండు వూళ్ళూ కలిసి మెలిసి ఉండేవనటానికి సూచనగా మాత్రం వాగువతల ఒడ్డెక్కించిన బల్లకట్టొకటి జీర్ణావస్థలో కనిపిస్తూ ఉంటుంది. కాస్త దూరమే అయినా, ఇటువైపు పేట పెరగటంతో ప్రస్తుతం ఈ రెండు ఊళ్ళకూ సంబంధం దాదాపు తెగిపోయినట్లే. ఎన్నికల్లో పల్లె మునగపాడులోని ఒక వార్డులో ఒక భాగం. అయితే, పల్లెవాళ్ళు ఏ నాడూ ఎవరినీ ఎన్నుకున్న పాపాన పోలేదు. ఆ గ్రామంలో పెద్దగా పార్టీల గొడవ లేక పోవడంతో పంచాయితీ ఎన్నికల్లో మునగపాడువాళ్ళే నిల్చునే వాళ్ళు. వాళ్ళే ఓట్లు వేసుకునే వాళ్ళు. వాళ్ళే గెలుచుకునే వాళ్ళు. అంతకన్నా పెద్ద ఎన్నికల సంగతి సరేసరి. పల్లెను గురించి పట్టించుకున్నవాళ్ళు లేరు. పల్లెవాళ్ళూ వాటిని గురించి పట్టించుకోలేదు. పల్లెకు ఇతరులు ఎవళ్ళూ, ఎప్పుడూ, ఏమీ చేయలేదు. వీళ్ళు ఆశించనూ లేదు. తమ అవసరాలు తమకన్నా ఎక్కువగా మరొకళ్ళు చూడాలనుకోవటం ఏమి న్యాయం — అని వాళ్ళ ఉద్దేశం. పల్లె తనకు



తానే సర్వస్వం.

పల్లెలో పొలాలు కావటానికి వేరు వేరు కుటుంబాలవైనా, అవసరానికి అందరివీను. ఒకరి పొలం ఓ ఏడు పండినా, పండకపోయినా దిగులు పడవలసిన పని లేదు. ఎవరికి ఏమి తక్కువైనా పల్లె మొత్తం ఆదుకుంటుంది; ఆదుకోవాలి. ఎప్పుడు మొదలైందో ఏమోకానీ, ఆ పల్లెది అదీ పద్ధతి. ఎవరికి ఎవళ్ళను ఏమిమ్మని అచ్చుమయ్య చెప్పినా వాళ్ళు ఇచ్చి తీరతారు. అతడూ అదే విధంగా ఇస్తాడు.

ఇదంతా తెలిశాక నాగేశానికి పల్లె ఒంటరితనంలో ఏ కల్మషం అంటని ప్రశాంతి కనిపించింది. చుట్టూ ఉన్న చేలలో పల్లెకు ప్రాణం పోసే పచ్చని త్యాగం కనిపించింది. అతనికి పల్లె పట్ల ఆత్మీయత పెరిగింది.

ప్రొద్దుట చదరంతో చిన్న పిల్లలూ, మధ్యాహ్నం పేకపెట్టె కింద మధ్యవయసు వాళ్ళూ, సాయంకాలం ఇంటిముందు అరుగుమీద యువజనమూ—అన్ని వేళలా ఆ చిన్న కుటీరం కళకళలాడుతూ ఉంటున్నది. చదువుమాత్రం చెప్పే మామూలు ఉపాధ్యాయుణ్ణి మించిన వ్యక్తిత్వంతో నాగేశం వెంకటేశుకు గౌరవనీయుడయ్యాడు. ఏ వయసువారికి కావలసిన విజ్ఞానాన్ని ఆ వయసు వారికి అందిస్తూ అచ్చుమయ్యకు అభిమానపాత్రుడయ్యాడు. ఆ చిన్న పల్లెను తన విశాలమైన హృదయంలో ఇముడ్చుకుని, దాని కష్టసుఖాలకు స్పందిస్తూ పల్లె మొత్తానికీ ఆప్తుడయ్యాడు. నాగేశాన్ని అడగందీ ఏ పనీ చెయ్యడు వెంకటేశు. నాగేశానికి చెప్పందీ ఏ పనీ చెయ్యడు అచ్చుమయ్య. నాగేశానికి తెలియకుండా ఏ పనీ చెయ్యరు పల్లెలో ఎవరూ. బతుకుతెరువుకోసం పల్లె చేరిన పంతులు కాడు నాగేశ మిప్పుడు. పల్లె దేహంలో ఓ అవయవం. పల్లె గుండెలో రక్తం.

అరిటి గెల కోయించి పేటకు పంపి, పూట అచ్చుమయ్య ఇంట్లో ఇద్దామని వచ్చిన వెంకటేశు ఏదో కబుర్లలో పడ్డాడు. ధాన్యం అమ్మకంనుంచి ఎడ్ల కొనుగోలుదాకా ఎన్నెన్నో సంగతులు వాళ్ళ మాటల్లో దొర్లుతున్నాయి. వీళ్ళ మాటల్లో వీళ్ళు ఉండగా పక్క వూళ్ళ పెద్దలు అయిదారుగురు జీపులో వచ్చి ఇంటిముందు దిగటం ఇద్దరికీ ఆశ్చర్యం కలిగించింది. తాము వచ్చిన విషయం వెంకటేశు ముందు ప్రస్తావించటానికి వాళ్ళు మొదట కాస్త సందేహించారు. కానీ, వాళ్ళిద్దరికీ ఉన్న ఆత్మీయత గమనించాక బయటపెట్టారు

ఈమారు సమితి ప్రెసిడెంటు గిరీకి పోటీ పడదలుచుకుంటున్న వాళ్ళిద్దరూ నిన్న మొన్నటిదాకా ఒకటే. ఏదో అభిప్రాయభేదంతో ఈమధ్యే చీలిపోయారు. వాళ్ళయితే విడిపోయారు కానీ, మిగతా మిత్రవర్గం ఏ వైపూ మొగ్గకుండా ఉండిపోయింది. వాళ్ళు చేసిన రాజీ ప్రయత్నాలు ఫలించలేదు సరికదా, పట్టుదలలు మరింత ఎక్కువైనాయి. వారిలో ఏ ఒకరు పోటీచేసినా రెండోవారు తీవ్రంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నారు. అంటే, పంచాయతీలనుంచీ, ఆ మాట కొస్తే వార్డుల స్థాయినుంచీ కూడా పగలూ,



కండ్లకలక మంటలు
పుసికట్టుట అంటుకొనుట
మొ. కండ్లజబ్బులకు
ఐ కోల్డ్ లోషన్
Manufacturers
THE EYE COLD LOTION DEPOT
PB NO 2 PRODDATUR Andhra Pradesh

ప్రఖ్యాతి చెందిన!
ఖటావ్ మిల్లు వారి
★100% పాలియస్టర్ చీరలు
★ఫుల్‌వాయిల్, అఫ్‌వాయిల్ చీరలు
★షర్టింగులు, గ్లాసుకో ధోవతులు
★డ్రస్ మెటీరియల్సు, బెడ్ షీట్లు
★స్కూలు యూనిఫారంలు_వగైరాలకు
విజయ షోరూమ్
ప్రత్యేక ఖటావ్ మిల్లు వస్త్రముల షోరూమ్
... హాస్పటల్ రోడు,
గవర్నరుపేట......విజయవాడ-2


ఆయుర్వేదీయ
బైద్యనాథ్
దంతమంజన్
ఎఱ్ఱ పళ్ళపొడి
కేవలము పళ్ళపొడే కాదు! ఆయుర్వేద ఔషధము కూడాను!!
దంతములను చిగుళ్ళను గట్టి పరచును
ఇతర టూత్‌పేస్టులు, పళ్ళపొడులు దంతములను శుభ్రపరచును. వీనిలో ఔషధ పదార్థములు లేనందున రోగముల నరికట్టలేవు. కనుకనే భారతదేశములో '90 శాతము ప్రజలకు చిగుళ్ళ బాధ ఉన్నాయి.

దంతనిపుణులున్నటువంటి కన్స్యూమర్ కౌన్సిల్ ఆఫ్ ఇండియావారిచే ఆమోదించబడింది. ప్రసిద్ధ ఆయుర్వేద ఔషధములను తయారుచేయు శ్రీ బైద్యనాథ్ ఆయుర్వేద భవన్ లిమిటెడ్ వారిచే లవంగనూనె, వేప, తుమ్మ, శొంఠి, కర్పూరము మొదలగు అనేక అమూల్య వనమూలికలతో తయారు చేయబడినది. బైద్యనాథ్‌వారి ఎఱ్ఱ పళ్ళపొడి వాడుట వలన దంతములు, చిగుళ్ళు దృఢముగా, ఆరోగ్యముగా నుండును.
శ్రీ
బైద్యనాథ్
ఆయుర్వేద భవన్
లిమిటెడ్
ఆయుర్వేద
ఔషధముల
తయారీదారులలో
ప్రసిద్ధులు.
INTERMARK/DML 19T

ద్వేషాలూ రెచ్చిపోవచ్చు. ఆ పరిస్థితుల్లో వాళ్ళకు ఏకగ్రీవంగా గుర్తు వచ్చిన వ్యక్తి అచ్చుమయ్య. అతణ్ణి సమితి ప్రెసిడెంటు చేస్తే ప్రజల్లో ఐకమత్యం చెడిపోయే ప్రమాదం తప్పుతుంది. అతనికి చుట్టుపట్ల మంచి పేరు ఉండటం వల్లనే కాదు, అతడు పాత సర్పంచి కాకపోవటంవల్ల కూడా అత డంటే ఎవ్వరికీ వ్యతిరేకత ఉండే అవకాశం లేదు.

తలకు మించిన బాధ్యత తన కెందుకని అచ్చుమయ్య తటపటాయించాడు గానీ, వాళ్ళ మాటల్లోని ఏదో తీయుదనం అతణ్ణి ఆకట్టుకుంది. పైగా, దానివల్ల ఎవరికైనా మేలు ఉంటే ఉందేమోతప్ప, కీడుమాత్రం ఎవ్వరికీ లేదని అతనికి గట్టి నమ్మకం కుదిరింది. అచ్చుమయ్య సరేనన్నాడు.

అచ్చుమయ్య అంగీకారాన్ని మోసుకుని డొంకబాట వెంట దిగుళ్ళలో పడిపోతున్న జీవులు ఉక్కిరిబిక్కిరయ్యేదాకా దూసి వెంకటేశు వెనక్కి తిరిగే వేళకు— పల్లెలో పొద్దు నడినెత్తి కెక్కింది.

నెలవంక మాడుపై కిరణాల శూలలు గుచ్చి, పల్లెలో పొద్దు నడినెత్తి కెక్కింది.

అచ్చుమయ్య నిర్ణయం విన్న నాగేశం ఆనందించాడు. అచ్చుమయ్య నాయకత్వంలో సమితిలోని ప్రతి ఒక్క వూరూ పల్లెలాగా రూపొందుతుందని మురిసిపోయాడు.

అచ్చుమయ్యకు పోటీగా ఎవరూ నిలబడలేదు కానీ, పద్ధతి ప్రకారం గడియారం గుర్తుతో, అచ్చుమయ్య పేరుతో ప్రతి తలుపుమీదా, అక్కడక్కడ గోడలమీదా పోస్టర్లు అంటించారు. అతడు పదవిలో ఉన్నంతకాలం గడియారంలాగా క్షణం విరామం లేకుండా పని చేస్తాడని అర్థమట ఆ గుర్తుకు!

పల్లె జీవితంలో మొట్టమొదటిసారిగా ఎన్నికల కోలాహలం కనిపించింది. కాలువ దాటి మునగపాడు వెళ్ళ నవసరం లేకుండా పల్లెలో ఒక పోలింగ్ స్టేషను ఏర్పాటు చేయిద్దామని పెద్దలు అనుకున్నారు కానీ, అచ్చుమయ్య ఏకగ్రీవంగా ఎన్నిక కావటంతో ఆ అవసరం రాలేదు.


అనుకున్నట్టుగా అచ్చుమయ్య మునగపాడు సర్పంచీ అయ్యాక సమితి ప్రెసిడెంటూ అయ్యాడు.

ఎన్నికల్లో అచ్చుమయ్య సంతకం పెట్టవలసి వచ్చిన మొదటిసారి అతనికి నాగేశం గుర్తు వచ్చాడు. తనకూ చదువుకోవాలనే ఉండేది. కానీ, ఆ వయసులో నలుగురిలో కూర్చుని పలకా బలపం పట్టుకోవటానికి బిడియపడ్డాడు. వీలు చూసుకుని సంతకం పెట్టటం దాకా నేర్చుకున్నాడు. ఈవేళ తాను నలుగురిలోనూ ఘనంగా తన చదువురాని తనాన్ని కప్పిపుచ్చుకుంటున్నాడంటే, అది నాగేశం చలవేనని మనస్సులో మెదిలింది.

ఎన్నిక అయ్యాక కాగానే పల్లెలో వచ్చిన మొట్టమొదటి మార్పు నాగేశం బడి సమితి బడి కావటం. బడితోబాటు నాగేశం కూడా సమితి సర్వీసులోకి వెళ్ళిపోయాడు. పిల్లల సంఖ్య పెద్దగా లేకపోవటం వల్ల కొత్త మేస్టర్లను మాత్రం ఎవరినీ వెయ్యలేదు. నాగేశం అభీష్టం ప్రకారమే కొత్త స్కూలు భవనం కట్టించే ఉద్దేశం మానుకున్నాడు అచ్చుమయ్య. ఇంతకాలంగా ఆ కుటీరం—పిల్లలనేమిటి, పెద్దల నేమిటి— పల్లెలో ఎంతోమందిని విద్యావంతులుగా చేసింది. చదువు నేర్పింది; సంస్కారం నేర్పింది. పల్లెకు లోకజ్ఞానం ఇచ్చింది. కళ తెచ్చింది. ఆ కుటీరాన్ని వదలదలుచుకోలేదు నాగేశం. కుటీరాన్నేమిటి—అక్కడ బ్లాక్‌బోర్డు స్థానంలో ఉన్న నాపరాతిని కూడా మార్చదలుచుకోలేదు. వాటితో అతనికున్న అనుబంధం అట్లాంటిది. తను ఉన్నంత కాలం అట్లాగే సాగనిమ్మన్నాడు నాగేశం. అట్లాగే కానిమ్మన్నాడు అచ్చుమయ్య. పేరు తేడాయే తప్ప బడి మామూలుగానే సాగిపోతున్నది. అచ్చుమయ్య రావటం తగ్గింది కానీ, మిగతా వాళ్ళతోబాటు వెంకటేశు రోజూ కాస్సేపు కూర్చుని పోతూనే ఉన్నాడు.

నడవటం కన్నా, రెండెడ్ల బళ్ళలో పడుతూ లేస్తూ ప్రయాణం చెయ్యటంకన్నా పది నిమిషాల్లో పేటలో దింపే బస్సు ప్రయాణం బాగుంది. మరి కొద్ది రోజుల్లో బడిపిల్లలకోసం పొద్దుటే ఇంకొక ట్రిప్పు మొదలయింది. ఆ ట్రిప్పులో పల్లెనుంచి పాలూ, పెరుగూ వూరు దాటటం ప్రారంభమయింది. సహజంగానే నెలవంక వీళ్ళకు కొత్త ప్రయోజనం చేకూరింది.

వాళ్ళూ, వీళ్ళూ అనుకున్నట్లు అచ్చుమయ్య సమితి కేంద్రానికి బస మార్చలేదు. కానీ, పల్లెలో ఎక్కువగా ఉండటానికి అతనికి వీలు చిక్కటం లేదు. ఎక్కడి కెక్కడికో తరుచు వెళ్ళుతూనే ఉన్నాడు. ఒకరోజు అచ్చుమయ్య పేటనుంచి జీపులో తిరిగి వచ్చి తన వాకిట్లో కాలు పెట్టే వేళకు ఒక తల్లీ, కూతురూ అక్కడికి వచ్చి చేరారు. పల్లె బళ్ళో ఆ అమ్మాయి అయిదవ తరగతి పూర్తి చేసింది. పేటకు వెళ్ళి హైస్కూలులో చేరతానంటుంది.




అచ్చుమయ్య మాటి మాటికీ మునగపాడు వెళ్ళవలసి ఉండటంవల్ల నెలవంకమీద కొత్త బల్లకట్టు వెలిసింది. పదిపైసల ఖర్చుతో అరకోసు దూరం తగ్గించే సాధనం పల్లెకు అమరింది. మొదటిసారి అచ్చుమయ్య బల్లకట్టు ఎక్కి డబ్బు లివ్వబోయినప్పుడు దాన్ని నడిపే మనిషి అన్నాడు: "తమరి దగ్గిర డబ్బులు పుచ్చుకునేటంత ఎర్రోణ్ణా, బాబూ! ఉంచండి. తమ దయుంటే చాలు." అట్లా ప్రయాణం చెయ్యటం తన హోదావల్ల తను సంపాదించుకున్న హక్కు అనిపించింది అచ్చుమయ్యకు. ఆ తరవాత ఎప్పుడూ అతడు కేవు ఇచ్చే ప్రయత్నం చెయ్యలేదు.

చిన్నా, పెద్దా కళ్ళింతలు చేసుకుని చూస్తూండగా డొంకబాటను దుమ్ము రేపుకుంటూ ప్రైవేటు బస్సొకటి పేటనుంచి రెండు ట్రిప్పులు వెయ్యటం మొదలుపెట్టింది. ఇది పల్లెవాళ్ళకు చాలా సౌకర్యంగా ఉంది. కూరల తట్టలు మోసుకుని ఆరు మైళ్ళ దూరం కాళ్ళు పడిపోయేటట్లు

ఎంత బస్సు ఉన్నా, ఆడపిల్లను దూరం పంపి చదివించటం తను మోయలేని బాధ్యత అంటుంది ఆమె. తనేమీ మాట్లాడకుండానే ఆ అమ్మాయి మాటి మాటికీ, "నేను చదువుకుంటానేవ్" అని శోకాలు తీస్తుండటం అచ్చుమయ్యకు విసుగనిపించింది. "తిరిగి తిరిగి ఇప్పుడేకదా వచ్చాను? ఏమిటీ గొడవ?" అని లోపలికి వెళ్ళిపోయాడు. వెంకటేశు ఈ విషయం నాగేశం దగ్గర ప్రస్తావించాడు. నాగేశం వాళ్ళను పిలిపించి, ఆరేడు క్లాసులకు తనే ప్రైవేటుగా చెప్పి ఆ అమ్మాయిని పబ్లిక్ పరీక్షలకు కూర్చోబెడతాననీ, అవసరాన్ని బట్టి మెట్రిక్‌దాకా కూడా తనే చెబుతాననీ మాట ఇవ్వటంతో ఆ సమస్య సమసింది.

ఏవేవో పనులమీద ఎప్పుడూ వస్తూ పోతూ ఉండేవాళ్ళతో అచ్చుమయ్య ఇల్లు సందడిగా ఉంటున్నది. అచ్చుమయ్య మకాం వసారాలోనుంచి లోపలి గదిలోకి మారింది. వసారాలో—అతనితో మాట్లాడటానికి వచ్చినవాళ్ళు తమ వంతు వచ్చే

దాకా కూర్చునేందుకు సమితి బెంచీలు చేరాయి. అయ్యగారు ఎవరితోటో మాట్లాడుతున్నారనో, నిద్దరపోతున్నారనో, అన్నం తింటున్నారనో, ఏమీ కాకపోతే విశ్రాంతి తీసుకుంటున్నారనో చెప్పటానికి ఒక నౌకరు కూడా చేరాడు.

నెలవంక మీద బ్రిడ్జి శాంక్షనయింది. పని మొదలై చురుకుగా సాగుతున్నది. ఆ కంట్రాక్టరు ఒక రోజు అచ్చుమయ్యను చూడవచ్చి, ఇంటి ముందున్న కొష్ఠం దుస్థితికి విచారించి, అప్పటి కప్పుడు సిమెంటు గోడలు లేపించాడు. సాయంకాలం పేట నుంచి తిరిగి వచ్చిన అచ్చుమయ్య అది చూసి ఆశ్చర్యపోయాడు గానీ, దాన్ని మనసులోనే దాచేసుకుని, తరవాత పూర్తిగా మరిచిపోయాడు.

ఈ బ్రిడ్జితో పేట నుంచి మునగపాడుమీదుగా అవతల దూరంగా ఉన్న బస్సు రోడ్డుకు అడ్డదోవ ఏర్పడింది. అది పక్కా రోడ్డుగా మారింది. ఆ రోడ్డు అచ్చుమయ్య మెరక పొలం గట్టు లోతట్టు నుంచి వేశారు.

అట్టహాసంగా జరిగిన బ్రిడ్జి ప్రారంభోత్సవం పల్లెలో పెద్ద వేడుకయింది. పల్లె అంతా అక్కడే ఉంది. బడి పిల్లలు సెలవు పుచ్చుకుని వచ్చేశారు. వెంకటేశం కళ్ళు ఆ ప్రాంతమంతా అదే పనిగా వెతుకుతున్నాయి. అంతలో అచ్చుమయ్య మంగళ వాద్యాల మధ్య ఇంటి నుంచి బయలుదేరి వచ్చి అందరూ ఆసక్తితో గమనిస్తూ ఉండగా బ్రిడ్జికి అడ్డంగా కట్టిన రిబ్బను కత్తిరించి ఆ బ్రిడ్జి మీదుగా అలంకరించిన జీపులో ఇటునుంచి అటు వెళ్ళాడు.

ఆ సందడికి దూరంగా తన ఇంట్లో ఒంటరిగా ఉండిపోయిన వాడు ఒక్క నాగేశం మాత్రమే. పల్లె ప్రస్థానం ఎటో అతనికి అర్థం కావటం లేదు.

ఆ వేడుకలు ముగించుకుని అచ్చుమయ్య ఇంటికి చేరేటప్పటికి పల్లెలోని మిగతా కామందులు కొందరు వచ్చారు. నాగేశం ఇంటి ఎదురుగా ఎవరో చిన్న పాక వేయిస్తూ ఉండటం వాళ్ళు గమనించారు గానీ, అది ఎవరిదో, ఏమిటో పట్టించుకోలేదు. చివరికి తెలియవచ్చిన దేమిటంటే, అది కల్లుపాకట! పల్లెలో అంతదాకా లేని అటువంటి అంగడి వెలియటం పట్ల వాళ్ళు ఆందోళన పడుతున్నారు. దాన్ని ఎలాగైనా తీసివేయించమని అచ్చుమయ్యను అడిగారు. దానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందనీ, ఆ విషయంలో తనేమీ చెయ్యలేననీ చెప్పాడు అచ్చుమయ్య. వాళ్ళింకేదో మాట్లాడబోయి కూడా ముఖముఖాలు చూసుకుని మౌనంగా వెళ్ళిపోయారు. వాళ్ళు దాన్ని పూర్తిగా ఎత్తేయించలేకపోయారుగానీ, బడి ఎదుట నుంచి పల్లెకు మరో వైపు కాస్త దూరానికి మార్పించ గలిగారు. అప్పటికే బ్రహ్మ ప్రళయమైపోయింది. నలుగురు చేరే చోటును వదులుకుని వెళ్ళటానికి అంగడి ఆసామి అంత తొందరగా ఒప్పుకోలేదు. ఈ కార్యసాధనలో నాగేశం చెయ్యి చాలా ఎక్కువగా ఉన్నదని తెలిసినప్పుడు మాత్రం అచ్చుమయ్యకు ఏదోలాగా అనిపించింది.

అచ్చుమయ్య పదవీ కాలం పూర్తి కావస్తున్నది. ఇంతకాలం తనతో సహకరించినందుకు కృతజ్ఞతగా అతిడు సర్పంచు అందరినీ తన ఇంటికి విందుకు ఆహ్వానించాడు. కాస్త ఏర్పాట్లు చూడమని వెంకటేశుకు చెప్పాడు. వెంకటేశు అచ్చుమయ్య ఇంటికి వెళుతూ ఉండగా తనకూ పని ఉన్నదని నాగేశం వెంకటేశు వెంట వెళ్ళాడు. దణ్ణం పెట్టి నిల్చున్నాడు.

నాగేశాన్ని చూడగానే అచ్చుమయ్య మనసులో ఒక సంచలనం చెలరేగింది. 'ఈ మధ్య నాగేశం తత్త్వం పూర్తిగా మారిపోయింది. అసలు ఇటు రావటం అసలు లేనేలేదు. తను ఎప్పుడన్నా బడి దగ్గరికి వెళ్ళినా ఒక్క దణ్ణం పెట్టి తప్పుకుంటున్నాడు.' చుట్టను కొనగోట విదిలుస్తూ పరామర్శించాడు: "ఏం, పంతులుగారూ! దర్శనాలే కరువయ్యాయి!"

నాగేశం తెల్లబోయాడు. అతనికి నోట మాట రాలేదు. తనీ మధ్య అచ్చుమయ్యను కలవటం పూర్తిగా తగ్గించేసిన మాట నిజమే కానీ, అతనికి ఎదురు తిరిగిందేమీ లేదు. ఈ వ్యంగ్యం ఏమిటో అతనికి అర్థం కాలేదు.



అచ్చుమయ్య మనస్సులో మథనపడుతున్నాడు. 'తను సమితికి ప్రెసిడెంటే కావచ్చు. పల్లెలో మాత్రం ఎవరికి ఏ సలహా కావలసివచ్చినా ఈ మధ్య నాగేశం దగ్గరకే వెళుతున్నారు. తనను పట్టించుకునేవాళ్ళే లేరు. ఎందుకొచ్చింది ఈ మార్పు?' ఒక్క క్షణం ఆగి, పడక్కుర్చీలో వెనక్కి వాలుతూ అన్నాడు: "అవునులే. పల్లె తగువులు తీర్చటంతో తీరిక లేనట్టుంది!"

తన దగ్గరికి వచ్చిన వాళ్ళకు తనకు తోచిందేదో తను చెబుతున్నాడు తప్ప, అందులో ఇంత నిష్ఠురంగా మాట్లాడవలసిందేమీ నాగేశానికి కనిపించ లేదు.

'తను ఎదురైనా నమస్కారం చేసి తప్పుకుని పోతున్నారే కానీ, పల్లెలో ఎవ్వరూ తన నిప్పుడు నోరారా "పెద్దయ్యా" అని పిలవటం లేదు. పల్లెకు తనంటే అదివరకటి ఆత్మీయత, గౌరవం ఎందుకు తగ్గిపోయాయి? పల్లెలో తన స్థానాన్ని నాగేశం ఆక్రమిస్తున్నాడా?' తెగని ఆలోచనలను మనసులోనే దాచేసి ప్రశాంతంగా అన్నాడు అచ్చుమయ్య: "సరేలే. దానికేంగానీ, బడి ఎట్లా సాగుతున్నది?"

"బడి బాగానే ఉంది. ఈ ఏడు అయిదవ తరగతిలో పద్దెనిమిది మంది ఉన్నారు. అందులో పది మంది ఆడపిల్లలు. వచ్చే ఏటి నుంచి దీన్ని అప్పర్ ప్రైమరీ చేస్తే వాళ్ళ చదువు కుంటుపడకుండా సాగుతుంది. అవసరాన్ని బట్టి నెమ్మదిగా హైస్కూలుగా కూడా పెంచవచ్చు." నాగేశం తన ఆలోచన చెప్పాడు.

"ఆఁ!" నిర్లిప్తంగా అన్నాడు అచ్చుమయ్య. నాగేశం ఈ విషయాన్ని ఇతరుల దగ్గర కూడా కదిపినట్లు అతనికి ఇదివరకే చూచాయగా తెలిసింది.

నాగేశానికి వచ్చిన పని అయిపోయింది. వెంకటేశు కోసం ఒక్క క్షణం చూచాడు. అతడు లోపల ఏవో ఏర్పాట్లు చేస్తున్నట్లు మాటలు వినవస్తున్నాయి. ఇక వెళ్దామా అనుకుంటూండగా — "అంతేగా?" అంటూ పడక కుర్చీ చేతుల మీదికి కాళ్ళు జాపాడు అచ్చుమయ్య.

నాగేశం సెలవు తీసుకుని వచ్చేశాడు. మనసుకు బూజుపట్టినట్లు అతడు చికాకుగా ఉన్నాడు.

అచ్చుమయ్య ఇల్లు అతిథులతో సందడిగా తయారయింది. అతని కార్యదక్షతనూ, మంచితనాన్నీ, ఔన్నత్యాన్నీ, కలుపుగోలుతనాన్నీ, స్నేహగుణాన్నీ వాళ్ళందరూ అనేక విధాల పొగిడి, వచ్చేసారి కూడా అతనే ప్రెసిడెంట్ కావాలని మనసారా కోరారు. భోజనాలు పూర్తిచేసి, విశ్రాంతి తీసుకుని, ఫలహారాలు చేస్తూ కాస్సేపు కబుర్లాడుకుని సాయంకాలానికి అందరూ తిరుగు ప్రయాణమయ్యారు.

కార్యక్రమం ఏ లోటూ లేకుండా జరిగిపోయినందుకు వెంకటేశుకు ఆనందంగా ఉంది. అచ్చుమయ్య మనసు తేలిగ్గా ఉంది. అతిథులు ఉల్లాసంగా ఉన్నారు.

రోడ్డుమీదికి వచ్చి, చుట్టూ ఒకసారి చూసి ఒక సర్పంచి అన్నాడు: "లక్ష్మయ్యగారు ప్రెసిడెంటు కాకముందే బడి పెట్టించి పల్లె అభివృద్ధికి పాటుపడ్డ మహానుభావులు! వారు ప్రెసిడెంటయిన తరవాత దాన్ని సమితి బడి చేశారనుకోండి. దాన్ని అప్పర్ ప్రైమరీగా పెంచాలని ఈ సారి సమితి మీటింగులో నేను ప్రతిపాదిస్తాను."

"నేను సెకండ్ చేస్తాను" అనే మాట ఒక్కసారి అయిదారుగురి నోళ్ళనుంచి వచ్చింది.

అంతమంది సెకండ్ చెయ్యటం అనే అభిప్రాయం గమ్మత్తుగా ఉండి వాళ్ళందరూ నవ్వుకుంటూ ఉండగా అచ్చుమయ్య గంభీరంగా అన్నాడు:

"అవసరమైతే అట్లానే చెయ్యచ్చుగానీ, ప్రస్తుతం రోల్ చాలా తక్కువగా ఉంది. పైపెచ్చు మునగపాడు మూడో వార్డులో బడి లేక పిల్లలకు చాలా ఇబ్బందౌతున్నది. అసలు పల్లె బడినే అక్కడికి మార్చాలని నేను ప్రతిపాదించదలుచుకున్నాను. కావాలంటే పల్లెవాళ్ళు అక్కడికే వెళ్ళవచ్చు. బ్రిడ్జి పడింది గదా?"

దూరాన నిలుచుని వీళ్ళ మాటలు వింటున్న వెంకటేశు బిత్తరపోయాడు. అతడ తేరుకుని చూసే వేళకు — పల్లెలో పొద్దు వాటారింది.

నెలవంక నీళ్ళలో రక్తం కలిసి పొద్దు వాటారింది.

★